
# ఇంటా-బయటా

ఆర్.వి.లక్ష్మీదేవి

బెంగాలీ మూలం: సదర్-ఒ-అందర్
రవీంద్రనాథ్ ఠాగూర్



**విపిన్ అందగాడు గాయకుడు. రాజాగారు అభిమానించి తన నాటక కంపెనీలోకి తీసుకున్నాడు. రాణీగారికి అకారణమయిన కోపంతో విసుగొచ్చింది. పరిస్థితి మారింది. రాణికే విపిన్ అంటే అభిమానం ఏర్పడింది. అది తెలిసిన రాజా విపిన్‌ను బయటకు పంపించాడు- విషయం తెలియని విపిన్ విశాల ప్రపంచంలోకి అడుగు పెట్టాడు.**

విపిన్‌కిశోర్ ధనవంతుల ఇంట్లో పుట్టేడు, అందుచేత ధనం బాగా ఖర్చు చెయ్యడం తెలుసు కాని అందులో సగం వంతుకూడా ధనం సంపాదించడం నేర్చుకోలేదు. ఫలితంగా, పుట్టిన ఇంట్లో ఎక్కువ కాలం వుండలేకపోయేడు. అంతా పోగొట్టుకుని బయటికి వచ్చెయ్యవలసివచ్చింది.

విపిన్ అందంగా, సుకుమారంగా తరుణ వయస్సులో వున్న యువకుడు. గాత్ర సంగీతం, జంత్ర సంగీతంలో సిద్ధహస్తుడు. కాని ఇంకేపనీ చేతకాదు. ప్రపంచంలో బ్రతకడానికి ఏపనీచేతగాని అసమర్థుడు. జీవనయాత్రలో, జగన్నాథుడి రథంలాగ, కదలలేని పరిస్థితి అతడిది. అతడి గురించి ఇంకెవరైనా అన్ని ఏర్పాట్లు చేసి అమర్చిపెడితే తప్ప, అతనికి జీవితం గడవదు. కాని, ప్రస్తుతం అలాంటి అవకాశం ఏదీలేదు.

అదృష్టవశాత్తూ, రాజా చిత్తరంజన్‌కి, అప్పుడే మైనారిటీ తీరి కోర్టు అఫ్ వార్డ్సు ద్వారా అతని జమిందారీ ఆస్తి అతని చేతికి వచ్చి, తన సరదాకి ఒక నాటక కంపెనీ ఆరంభించడానికి ప్రయత్నాలు చేస్తున్నాడు. విపిన్‌కిశోర్ అందమైన రూపం చూసి, పాటలు పాడే మధురమైన గొంతువిని, పాటలు రచించే ప్రతిభని చూసి ముగ్ధుడై తన నాటక కంపెనీలోకి తీసుకున్నాడు.

రాజా బి.ఏ. పాసయేడు. క్రమశిక్షణలో పెరిగినవాడు. ఏ విషయంలోనూ విశృంఖలంగా ప్రవర్తించేవాడు కాదు. ధనవంతులబిడ్డ అయినా, అన్నీ నియమానుసారంగా చేసేవాడు. నిర్దిష్టమైన స్థానంలోనే భోజనం, పడక, చేసేవాడు. విపిన్ కిశోర్‌ని చూడగానే, హఠాత్తుగా అతనికి నిషా పట్టుకున్నట్టు అయిపోయింది. అతడి పాటలు వింటూ, అతడు రచించిన గీతినాటికల గురించి చర్చిస్తూ వుంటే, భోజనం చల్లారిపోయేది రాత్రి చాలా పొద్దుపోతూ వుండేది. క్రమబద్ధమైన అలవాట్లు గల తన యజమాని దిన చర్యలో కేవలం ఈ విపిన్‌కిశోర్ అంటే విపరీతమైన ఆకర్షణ వల్ల, మొదటిసారిగా, మార్పులు వచ్చాయని, దివాన్‌జీ అనడం మొదలుపెట్టేడు.

రాణి వసంతకుమారి, భర్తమీద కోపగించుకుని, "ఎక్కడి నుంచో ఈ ముదనష్టపు కోతిని తీసుకు వచ్చి ఆరోగ్యం పాడు చేసుకుంటున్నారు. వాడిని పంపేస్తేగాని నాకు ఊపిరాడేట్టులేదు." అంది.

రాజా, యువతి అయిన తన భార్య ఈర్ష్యని చూసి, మనసులో కొద్దిగా సంతోషించేవాడు, నవ్వుకునేవాడు. ఆడవాళ్లు ఎవరిని ప్రేమిస్తారో, వాళ్లు తప్ప ఇంకెవరూ, వాళ్ల కంటికి ఆనరు. ప్రపంచంలో ఎంతోమంది, ప్రశంసనీయమైన గుణాలు కలవాళ్లు వున్నారన్న సంగతి, వాళ్ల శాస్త్రంలో రాసి పెట్టలేదు. ఎవరైతే వాళ్ల మెడలో పుస్తె కట్టేరో, వాళ్లే అందరి కంటె గొప్పవాళ్లు, వాళ్లమీదే తమ ఆదరణ నంతటినీ ఒలకబోస్తారు. భర్త అరగంట ఆలస్యంగా భోజనానికి వస్తే, రాణి సహించలేకపోయేది. కాని తన భర్త ఆశ్రితుడిని తరిమేస్తే, అతడికి పిడికెడు అన్నం దొరకదనే సంగతి, ఆమె పూర్తిగా విస్మరించేది. వివేచనాహీనమైన ఇటువంటి పక్షపాతం నిందించదగినదే, కాని చిత్తరంజన్‌కి కోపం వచ్చేది కాదు. అందుచేత, అప్పుడప్పుడు విపిన్ గుణగణాలు ఎక్కువగా పొగిడి, భార్యని ఉడికించి, ఏడిపించి సరదా పడుతూ వుండేవాడు.

కాని, ఈ చెలగాటం విపిన్‌కి ప్రాణాంతకంగా వుండేది. అంతఃపురంలోని రాణి, అతడి పట్ల విముఖంగా వుండడం చేత, అడుగడుక్కీ, అతని భోజనం వగైరా విషయాల్లో ఎన్నో ఇబ్బందులు మొదలయేయి. ధనవంతుల ఇళ్లల్లో నౌకర్లు, వాళ్ల యజమానుల దగ్గర ఆశ్రితులని చిన్నచూపు చూడ్డం స్వభావసిద్ధమే. వాళ్లు రాణీగారి కోపాన్ని అండగా చేసుకుని, ధైర్యంగా విపిన్‌ని ఉపేక్షచేసి, అవమానిస్తూ వుండేవారు.

ఒకరోజు, రాణి, పూంటే అనే నౌకరు మీద చిరాకుపడుతూ, "ఏపని చెప్పాలన్నా నువ్వు కనిపించవు, రోజంతా ఏం చేస్తున్నావు?" అని అడిగింది.

వాడు, "రాజాగారి ఆజ్ఞప్రకారం, విపిన్ బాబు సేవలోనే రోజంతా గడిచిపోతున్నాది." అన్నాడు.

రాణి, "ఓస్, విపిన్‌బాబు పెద్ద నవాబు కాబోలు!" అని విసుక్కుంది.

మర్నాటినుంచి వాడు విపిన్‌బాబు అన్నం తిన్న తరువాత ఎంగిలి కంచం కడగడం మానేసాడు. ఎన్నోసార్లు అన్నం మీద మూత వుండేది కాదు. అలవాటు లేని చేత్తో విపిన్‌బాబు తన కంచం తనే కడుక్కునేవాడు. ఒక్కొక్కసారి నౌకరు భోజనం తీసుకురాకపోతే, ఉపవాసం వుండవలసి వచ్చేది. కాని వీటి గురించి రాజాతో ఫిర్యాదు చెయ్యడం అతని స్వభావానికి విరుద్ధం. ఎప్పుడూ ఏ నౌకరుతోటీ దెబ్బలాడి తనని తను అవమానించుకోలేదు. ఈ విధంగా, విపిన్ అదృష్టవశాత్తూ, అతడికి బయటి నుంచి ఆదరణ ఎక్కువైంది, ఇంట్లో అనాదరణ, అమర్యాదలకి అంతులేకుండా అయింది.

ఒకవైపు 'సుభద్రాహరణ్' గీతినాటిక రిహార్సల్సు జోరుగా అవుతున్నాయి. రాజాగారి కోట ఆవరణలోనే ఆ నాటకం వెయ్యడానికి సన్నాహాలు జరిగేయి. రాజా స్వయంగా కృష్ణుడి వేషం వేసేడు. ఆహా! అర్జునుడు ఎంత అందంగా వున్నాడో, అతడి గొంతుకూడా అంత తియ్యగా వుంది. ప్రేక్షకులందరూ 'వాహ్వా! వాహ్వా!' అని కరతాళ ధ్వనులు చేసేరు.

రాత్రి, రాజాగారు, రాణి వసంతకుమారిని, "ఎలావుంది అభినయం?" అని అడిగేరు. రాణి, "విపిన్ అర్జునుడిగా చాలా బాగా నటించేడు. పెద్దింటి కుర్రాడు. రూపం ఎంత అందంగా వుందో, గొంతుకూడా అంత మధురంగావుంది" అంది. రాజా, "అయితే, నా రూపం బాగులేదు కాబోలు, గొంతుకూడా అంత వినసొంపుగా లేదు కాబోలు." అన్నాడు. రాణి, "నీ సంగతి వేరు." అని మళ్లీ విపిన్ అభినయం గురించి మాట్లాడి, అతడిని పొగిడింది.

రాజా, ఇంతకంటె ఘాటైన భాషలో రాణి దగ్గర విపిన్‌గుణగానం చేసేవాడు. కాని ఇప్పుడు రాణి నోటినుంచి రెండు ప్రశంసావాక్యాలు వినేటప్పటికి సహించలేకపోయేడు. తెలివి తక్కువ వాళ్లు, విపిన్ ప్రతిభని పొగిడి, వున్నదానికంటే, ఎక్కువగా చేసేస్తారు, అనుకున్నాడు. ఇంతకీ, విపిన్ ఏమంత బాగుంటాడు? గొంతు మాత్రం ఏమంత బాగుంటుంది? కొద్దికాలం క్రితం వరకు, తను కూడా ఆ తెలివి తక్కువ వాళ్ల శ్రేణి లోనే వుండేవాడు, హఠాత్తుగా ఏ కారణం చేతనో తన వివేచనా శక్తి పెరిగిపోయింది!

ఆ మర్నాటి నుంచి విపిన్ భోజనం ఏర్పాట్లు బాగయేయి. రాణి వసంతకుమారి, "విపిన్‌కి ఆ పావిట్లో, అమలా వాళ్లలాంటి పనివాళ్లతో పాటు వసతి ఇవ్వడం తప్పయింది. ఎంతైనా, ఒకప్పుడు అతడి పరిస్థితి బాగుండేది." అంది.

రాజా ఆ మాట విని సంక్షిప్తంగా, 'హోం', అని మాత్రం వూరు కున్నాడు.

రాణి, "బాబు అన్నప్రాసన సందర్భంగా, ఇంకో రోజు నాటకం వేస్తే బాగుంటుంది."

అని కోరింది.

రాజా ఆ మాట వినిపించుకోనే లేదు.

ఒకరోజు తన పంచె కుచ్చెళ్లు సరిగ్గా పెట్ట లేదని పూంటే నౌకరుని కోప్పడితే, వాడు, "ఏం చేసేది? అమ్మగారి ఆజ్ఞప్రకారం విపిన్ బాబు గిన్నెలు తోమి, అతని సేవ చేసేటప్పటికే రోజంతా సరిపోతున్నాది." అన్నాడు.

రాజా కోపం పట్టలేక, "ఓస్, విపిన్‌బాబు పెద్ద నవాబు అయిపోయేడు. తన గిన్నెలు తను తోముకోలేడా?" అన్నాడు.

విపిన్‌బాబు పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది.

రాణీ, సాయంకాలం పూట సంగీత కచేరీ జరిగినప్పుడు, విపిన్ పాట అంటే తనకిష్టమనీ, కూర్చుని వింటాననీ, ప్రాధేయ పడింది. కాని ఆ రోజు నుంచి గానా బజానాలన్నీ బంద్ అయిపోయేయి. రాజా, మునుపటిలాగ, అతి నియమాను సారంగా వేళపట్టున భోజనం చెయ్యడం, నిద్రపోవడం మొదలుపెట్టేడు.

రాజా మధ్యాహ్నంవేళ జమిందారీ వ్యవహారాలు చూసుకునేవాడు. ఒకరోజు ఉదయం లోపలికి వెళ్లి చూస్తే, రాణి వసంతకుమారి ఏదో చదువుతోంది. రాజా, "ఏం చదువుతున్నావు?" అని అడిగేడు.



"ఎందుకురా! స్నానాల గదిలోకి పోయినపు డల్లా తోక తెగిన మేకలా పాడతావ్!" "లోపల గొంతు విరిగిపోయిందిరా బాబూ!"

రాణి మొదట కొంచెం ఆశ్చర్యపోయి, "విపిన్‌బాబు రాసిన పాటలపుస్తకం తెప్పించేను ఒకటి రెండు పాటల సాహిత్యం కంఠస్థం చేద్దామని. మీకు పాటలు వినే సరదా హఠాత్తుగా పోయిందేమిటీ?" అని అడిగింది. ఇంతకు పూర్వ ఆసరదాని సమూలంగా నాశనం చెయ్యడానికి ఆమె శతవిధాల ప్రయత్నించిందన్న సంగతి, ఆమెకి ఎవ్వరూ జ్ఞాపకం చెయ్యలేదు.

మరుచటి రోజు విపిన్‌ని, రాజా తన ఆస్థానం లోనుంచి పంపించేసేడు. రేపటినుండి అతడికి పిడికెడు అన్నం ఎక్కడ దొరుకుతుందన్న విషయం రాజా ఆలోచించవేలేదు.

విచారకరమైన విషయం అదేకాదు. ఈ మధ్య విపిన్‌కి రాజా అంటే నిర్మలమైన స్నేహం, ప్రేమ కలిగేయి. రాజా ఇచ్చే జీతం కంటె, అతని ఆదరణ, అనురాగం ఎక్కువ విలువైనవిగా అనిపించేవి. కాని తను చేసిన అపరాధం ఏమిటి? ఏ కారణం చేత తను రాజా హృదయంలోని స్థానాన్ని పోగొట్టుకున్నాడో, విపిన్‌కి ఎంత ఆలోచించినా అర్థంకాలేదు, ఒక దీర్ఘమైన నిట్టూర్పు విడిచి, తన పాత తంబూరా తీసుకుని, దానికి ఒక గులాబీ పువ్వు తగిలించి, 'నా' అన్న వాళ్లు లేని ఈ విశాల ప్రపంచంలోకి, బయటికి, వచ్చేసేడు. వెళ్లిపోయే ముందు, తన దగ్గర ఆఖరికి మిగిలిన రెండు రూపాయలు, రాజ సేవకుడు, పూంటే చేతిలో పెట్టి, వెళ్లిపోయేడు. *

